సంపుటి - 6 జూన్ - 2023 సంచిక - 10

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం............................................3

పెద్దల మీద గౌరవం ............................................5

మహా శుక్రవారం ............................................7

పునీత బొనిఫాసు ............................................9

బైబిల్ దర్శనం............................................11

దెబొరా ............................................13

శుభవచనం బైబిల్ క్విజ్............................................15

ఇంద్రధనుస్సు............................................17

ఏంజెల్స్ కార్నర్............................................18

యువ స్పందన ............................................19

బైబిల్ దృశ్యమాలిక............................................21


శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు............................................23














**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదకవర్గం**

ఫాదర్ సిజో
ఫాదర్ ఎబిన్
Mr. M. సత్యం
సిస్టర్ క్రిస్టీన CMC
Mrs. K. శ్రీలత
Mr. J. లూర్దు స్వామి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**


**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**వేదన వలన గుండెలు పగిలిన వారికి ప్రభువు చేరువలోనే యుండును. బాధల వలన ధైర్యము కోల్పోయిన వారిని అతడు రక్షించును.**

**(కీర్తన 34, 18)**





# తండ్రి గారి సందేశం....

## జ్ఞానమునకు, సమృద్ధికి నిలయము, మూలము దేవుడు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

విద్యా రంగానికి, వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాముఖ్యమైన కాలం జూన్ నెలతో ప్రారంభమవుతుంది. తొలకరి వానలు పడగానే రైతులు వ్యవసాయ పనుల కోసం సిద్ధమవుతారు. అదే విధంగా, ఈ నెలలో తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతన విద్యా సంవత్సరం కోసం సిద్ధమవుతారు. ఈ రెండు విషయాలలో ప్రపంచానికి సృష్టికర్త, సకల విజ్ఞానానికి నిలయము, మూలమైన దేవుని ఆశీర్వాదం, కృప మనకు ఎంతో అవసరం.

'విత్తువానికి విత్తనములు, తినుటకు రొట్టె సమకూర్చు దేవుడు మీకు ఎన్ని విత్తనములు కావలయునో అన్నియు సమకూర్చి, వానిని వర్ధిల్లజేసి మీ ఉదార గుణము వలన మంచి పంట పండునట్లు చేయును." (2 కొరింతి 9,10) మంచి వాతావరణం, వర్షపాతం, దిగుబడిని దేవుడు అనుగ్రహించాలని మనమందరం వేడుకుందాం. అదే విధంగా, రైతుల కొరకు, వ్యవసాయ కూలీల కొరకు, వ్యవసాయ పనుల కొరకు ప్రత్యేకంగా ప్రార్థిద్దాం.

నూతన విద్యా సంవత్సర ప్రారంభ సమయంలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాఠశాల గురించి, పుస్తకాల గురించి, ఫీజుల గురించి ఆలోచిస్తూ ఉంటారు. విద్యార్థులు విద్యార్థి దశలో విద్యను నిర్లక్ష్యం చేయకూడదు. పిల్లల చదువుల కోసం, మంచి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. పిల్లలు చదువుతో పాటు క్రమశిక్షణను, మంచి నడవడికను అలవర్చుకోవాలి. క్రమశిక్షణ, మంచి నడవడిక లేని విద్య మనలను కేవలం యంత్రాలుగా మారుస్తుంది. మంచి మనిషిగా ఎదగని వ్యక్తికి ఎంత విద్య ఉన్నా అది నిరర్థకమే అని మనం గ్రహించాలి.

మానవ జీవితంలో ఈ లోక జ్ఞానం అవసరం. కాని, "దేవుని పట్ల భయభక్తులు కలిగి యుండుటయే విజ్ఞానమునకు మొదటి మెట్టు" (సామెతలు 1,7) అనే ముఖ్యమైన విషయాన్ని మనం నిర్లక్ష్యం చేయకూడదు అని దేవుని వాక్యం నేర్పిస్తుంది. విజ్ఞానమును సంపాదించే ప్రయత్నం చేసే వారందరు దేవుని పట్ల భయభక్తులు కలిగియుండాలి. క్రొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే ఈ సందర్భంలో తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ విషయంలో శ్రద్ధ వహించాలి. ప్రార్థనలతో ఈ నూతన సంవత్సరమును ప్రారంభించాలి. అంతే కాదు చదువుతో పాటు దేవుని మీద భయ భక్తులు కూడా పెంచే ప్రయత్నం చేయాలి. ఉపాధ్యాయుల బోధలు, పుస్తకాలు, ఈ లోక జ్ఞానమును సంపాదించడానికి తోడ్పడుతాయి. కాని,

ఇవన్నీ అసంపూర్ణమైన, అశాశ్వతమైన జ్ఞానమును మాత్రమే అందిస్తాయి. పూర్ణమైన జ్ఞానం, సరైన జ్ఞానం, శాశ్వతమైన జ్ఞానం దేవుని నుండి వస్తుంది. "సర్వ విజ్ఞానము ప్రభువు నుండి వచ్చును. అది కలకాలము ఆయన చెంతనే ఉండును" (సీరా పుత్రుడైన యేసు జ్ఞాన గ్రంథము 1,1). విజ్ఞానమునకు నిలయం, మూలం దేవుడు. కాబట్టి దేవుని తోడ్పాటు లేకుండా నిజమైన విజ్ఞానమును మనము పొందలేము. ఈ లోక విజ్ఞానం ఉపాధి కోసం, ప్రాపంచిక జ్ఞానం కోసం ఉపయోగపడుతుంది. ఆత్మ రక్షణకు దోహద పడే నిజమైన జ్ఞానం దేవుని నుండి మాత్రమే వస్తుంది. కాబట్టి విద్యార్థులందరు ఈ లోక విజ్ఞానం కోసం మాత్రమే కాకుండా దేవుని సన్నిధిలో ఉండి దైవీక జ్ఞానం కోసం కూడా ప్రయత్నించాలి.

దేవుడు సకల విజ్ఞానమునకు నిలయం. కాబట్టి ఆ దేవునితో నడిపింపబడి జ్ఞానమును సంపాదిస్తే అది మన జీవితంలో గొప్ప మార్పులను తెస్తుంది. ఈ విషయమును దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు, తల్లిదండ్రులు చదువుతో పాటు దైవ భక్తి విషయంలో కూడా శ్రద్ధ వహించాలి అని మీ ఆత్మీయ తండ్రిగా ఉపదేశిస్తున్నాను. చదువు కోసం, కోచింగ్ కోసం ఆదివారం దేవాలయానికి రావడం మాని వేయడం, సత్యోపదేశ (క్యాటికిసం) తరగతులను నిర్లక్ష్యం చేయడం ఆశీర్వాదకరం కాదు. దేవుని ఆశీర్వాదం ప్రతి ఒక్కరికి అవసరం. కాబట్టి చిన్నతనం నుండి దేవుని ఆశీస్సులతో చదువును ముందుకు సాగించడం విద్యార్థులకు అలవాటు చేయాలి.

పవిత్రమైన ఆలోచనలు, కళంకము లేని హృదయం ఉన్న వారికి జ్ఞానమును సంపాదించడం సులభమని పరిశుద్ధ గ్రంథం నేర్పిస్తుంది. జ్ఞానం పరిశుద్ధమైనది. అది అపవిత్రమైన మనస్సులోకి ప్రవేశింపదు. "జ్ఞానము కపటాత్ముని వరింపదు. అది పాపి హృదయమున వసింపదు. ఉపదేశము నొసగు పవిత్రాత్మ కపటమును అంగీకరింపదు, అది మూర్ఖతను సహింపదు, అన్యాయమును మెచ్చుకొనదు. జ్ఞానము నరులతో స్నేహము చేయు ఆత్మము. కాని అది దేవుని నిందించు వారిని సహింపదు''. (సొలోమోను జ్ఞాన గ్రంథము 1,4-6). కాబట్టి యదార్థమైన జ్ఞానం కోసం నిర్మలమైన హృదయం, దైవ భక్తి, పవిత్రమైన ఆలోచనలు అవసరం అని గ్రహించాలి. అంతేకాక జ్ఞానము కొరకు మనం దేవుని ప్రార్థించాలి. "మీలో ఎవరికైనా వివేకము కొరతగా ఉన్న యెడల, అతడు దేవుని అడుగవలెను. ఆయన దానిని ప్రసాదించును." (యాకోబు 1,5) మనమందరం విద్యార్థుల కొరకు, ఉపాధ్యాయుల కొరకు ప్రార్థిద్దాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# పెద్దల మీద గౌరవం

1. వృద్ధులను సన్మానించి గౌరవింపుడు. ప్రభువు పట్ల భయభక్తులతో మెలగుడు. నేను ప్రభుడను (లేవీ 19,32).

2. "యువకులారా! మీరును అట్లే మీ పెద్దలకు విధేయులై ఉండుడు. మీరు అందరును వినయము అను వస్త్రమును ధరింపవలెను. ఏలయన, దేవుడు అహంకారులను ఎదిరించి, వినయశీలురను కటాక్షించును" (1పేతురు 5,5)

3. "మీ తల్లిదండ్రులను గౌరవింపుడు. అట్లయిన మీ దేవుడయిన యావే మీకు ప్రసాదించిన దేశములో చిరకాలము జీవింతురు" (నిర్గమ 20,12).

4. "తల్లితండ్రులను గౌరవింపుము. నిన్ను నీవు ప్రేమించుకొనునట్లే నీ పొరుగువానిని నీవు ప్రేమింపుము" (మత్తయి 19,19).

5. "తండ్రులారా! మీ పిల్లల కోపము రేపక వారిని క్రమశిక్షణలోను, ప్రభువు బోధనలోను పెంచుడు" (ఎఫెసీ 6,4).

6. "వృద్ధుడగు వ్యక్తిని కఠినముగ గద్దింపక, అతనిని నీ తండ్రిగ భావించి హెచ్చరింపుము. పిన్నలను నీ సోదరులుగను, వృద్ధస్త్రీలను తల్లులగను భావించి సరిదిద్దుము. యువతులను, అక్కచెల్లెండ్రుగా పరిగణించి పూర్ణపవిత్రతతో తీర్చిదిద్దుము. నిజమైన అనాథలైన విధవరాండ్రను ఆదరింపుము" (1తిమోతీ 5,1-3).

7. "మీ నాయకులకు విధేయులై వారి ఆజ్ఞలను పాటింపుము. వారి సేవలను గూర్చి వారు దేవునికి లెక్క చెప్పుకొనవలసిన వారివలె వారు మీ ఆత్మలను కనిపెట్టుకొని ఉన్నారు. మీరు వారికి విధేయులై ఉన్నచో వారు వారి కర్తవ్యమును సంతోషముగ

నెరవేర్తురు. కానిచో తమ పనిని విషాదముతో చేయుదురు. అప్పుడు అది మీకు నిష్ప్రయోజనము" (హెబ్రీ 13,17).

8. "వారెల్లరు ఎలీహు కంటె పెద్దవారు కనుక వారు మాట్లాడునపుడు అతడు మాటలాడడయ్యెను" (యోబు 32,4).

9. "వృద్ధులు విజ్ఞానమును ఆర్జింతురు. పెద్ద ప్రాయము వలన వివేకము పుట్టును (యోబు 12,12).

10. "విజ్ఞత కలిగిన కుమారుడు తండ్రి దిద్దుబాటును అంగీకరించును. కాని పొగరుబోతు మందలింపును లెక్కచేయడు" (సామెతలు 13,1).

11. "నీకు పుట్టుకనిచ్చిన తండ్రి పలుకులాలింపుము. నీ తల్లి వృద్ధురాలైనపుడు ఆమెను ఆదరముతో చూడుము" (సామెతలు 23,22).

12. "పుణ్యపురుషులు దీర్ఘాయుష్మంతులగుదురు. తలనెరయుట గౌరవప్రదమైన కిరీటమును బడయుటయే" (సామెతలు 16,31)

13. ''పూర్వకాలములను స్మరించుకొనుడు. ప్రాచీనయుగములను స్మృతికి తెచ్చుకొనుడు. మీ తండ్రులను అడిగి తెలిసికొనుడు. మీ వృద్ధులను ప్రశ్నించి వినుడు" (ద్వితీ 32,7)

14. "ఆచారముల నెపముతో మీరు దేవుని ఆజ్ఞలను నిరాకరించుచున్నారు. 'తల్లిదండ్రులను గౌరవింపుడు. తల్లిదండ్రులను దూషించువాడు మరణదండనకు గురియగును' (మార్కు 7,9-10)

15. "ఎవ్వడేని తన తండ్రితోగాని, తన తల్లితోగాని 'నా నుండి మీరు పొందవలసినది దైవార్పితమైనది' అని చెప్పినచో అట్టి వాడు తనతండ్రినిగాని, తల్లినిగాని ఆదుకొను అవసరములేదని మీరు బోధించుచున్నారు. ఈ రీతిని మీరు పూర్వసంప్రదాయమును అనుసరించు నెపమున దైవవాక్కునే అనాదరము చేయుచున్నారు. ఇట్టివి అనేకములు మీరు చేయుచున్నారు" (మార్కు 7,11-13).

16. "బాగుగా పాలనచేయు పెద్దలను, అందును విశేషించి ప్రసంగములయందును, బోధనలయందును గట్టి కృషిచేయువారిని, రెట్టింపు గౌరవమునకు యోగ్యులుగ ఎంచవలెను" (1తిమోతీ 5,17).

17. "మీ ప్రభుడనైన నేను ఆదేశించినట్లే మీ తల్లిదండ్రులను గౌరవింపుడు. అటుల చేసిన యెడల నేను మీ కొసగబోవు నేల మీద మీరు దీర్ఘాయుష్మంతులై క్షేమముగా జీవింతురు" (ద్వితీ 5,16)

**"మీ హృదయమును కలవర పడనీయకుడు దేవుని విశ్వసింపుడు. నన్నును విశ్వసింపుడు"**

**(యోహాను 14,1)**




# మహా శుక్రవారం

మనం చరిత్రలోకి వెళ్ళి చూస్తే 2000 సం॥రాల క్రితం సిలువ వేరు, 2000 సం॥రాల తరువాత సిలువ వేరు. యేసు క్రీస్తు ఆ సిలువలో చనిపోకముందు ఆ సిలువ చాల నీచమైంది, నికృష్టమైంది. సిలువంటేను నికృష్టమైంది, దానికి విలువలేదు. అత్యంత నీచమైన, నికృష్టమైన, హీనమైన శిక్ష నేరస్థులకు ఇచ్చేది సిలువ. ఎప్పుడైతే ప్రభువు దానిపై చనిపోయారో దాని విలువ మారి పోయింది. కాబట్టి సిలువను మనం చూసినప్పుడు మనకు, సిలువ వేయబడిన క్రీస్తే గుర్తుకు రావాలి. అందుకనే సిలువను, ప్రభువును వేరు చేయలేం. ఉదాహరణకు “సిలువ ధ్యానం” అంటే సిలువ అనే ఆ వస్తువు కాదు. సిలువ వేయబడిన క్రీస్తు ధ్యానం. ఎందుకంటే మీరు క్రైస్తవులయితే మీరు పుట్టింది మీ అమ్మ, నాన్నకు కాదు. మనం పుట్టింది సిలువలో! సిలువలో ప్రభువు అనుభవించిన ప్రసవ వేధన ద్వారానే మనం పుట్టాం! “ఒకడు క్రొత్తగా జన్మిస్తేనే గాని పరలోక రాజ్యమును చేరలేడు!” క్యారెక్టర్ అనేదే లేని మనకు క్యారెక్టర్ ఇచ్చింది సిలువ. అందుకే యేసు ప్రభును చూసి ఒక భక్తుడు “నేను నీ పాపాన్ని నువ్వు నా నీతివి” అన్నాడు. ఎంత అద్భుతమైన వాక్యమండి. నీ కంటూ పాపమే లేదు ప్రభువా, నీకు పాపం వచ్చిదంటే అది నా వల్లనే! నా కంటూ నీతి లేదు ప్రభువా, నాకు నీతి వచ్చిందంటే అది నీవల్లనే! అందుకనే నీతిమంతులు గర్వించ నక్కరలేదు, పాపులు కృంగిపోనవసరం లేదు.

ఎందుకంటే పాపుల పాపాన్ని ఆయన మీద వేసుకున్నాడు నీతి లేని మనకు ఆయన నీతినిచ్చాడు. ఇక్కడ మనం గమనించవలసింది, స్వనీతి పరులు పరలోక రాజ్యానికి వెళ్ళలేరు. కొంతమంది అంటుంటారు. నేనెందుకు మారు మనస్సు పొందాలి? నేనేతప్పు చేయలేదు. చీమకు కూడ అపకారం చేయలేదు అని. అయితే ఇక్కడ సమస్య ఏమిటంటే అసలు చీమకైనా ఉపకారం చేశావా, లేదా అని, కొన్నిసార్లు కొన్ని పనులు చేస్తే పాపమంటుకుంటుంది, కొన్ని సార్లు కొన్ని పనులు చేయకుండా ఉండిపోతే పాపం అంటుకుంటుంది. పది ఆజ్ఞలలో చేయకూడనవి ఉన్నాయి, చేయవలసిన ఉన్నాయి. కొన్నిసార్లు మనం చేయకూడనవి చేసి ఉండకపోవచ్చు. కొంతమంది అసలు అబద్ధమే ఆడి ఉండకపోవచ్చు. కాని దేవున్ని ప్రేమించవలసినంత ప్రేమించక పోయినా పాపమే! తల్లిదండ్రులను సన్మానించక పోతే పాపం. నీవలె నీ పొరుగువాన్ని ప్రేమించకపోతే పాపం. అందుకే స్వనీతి మనల్ని పరలోకానికి తీసికెళ్ళదు. అందుకే సిలువ అందరికి శరణ్యం! మనం జ్ఞాపక ముంచుకోవలసిన మరొక విషయం ఏమిటంటే యేసుక్రీస్తు యొక్క సిలువ ఎదో ఒక కాలానికే పరిమితమైంది కాదు. ఆచారంలో ఉన్న ఒక సమస్య ఏమిటంటే అది ఒక కాలానికే పరిమితమై పోతుంది. క్రిస్మస్ సమయంలో సిలువ పాట పాడితే ఎలా ఉంటుంది? అయితే సిలువ పాట ఎప్పుడైనా పాడుకో వచ్చును. ఎందుకంటే క్రిస్మస్ సిలువ కోసమే! సిలువే లేకపోతే క్రిస్మస్ లేదు. ప్రభువు వచ్చిందే మనవులందరి పక్షాన మరణించడానికి! కాబట్టి సిలువకు సంబంధించిన పాట మనం ఏ కాలంలోనైనా పాడుకోవచ్చును. కాబట్టి సిలువను శ్రమలకాలానికే పరిమితం చేయవద్దు. ఒక క్రైస్తవుడు, క్రైస్తవురాలు సిలువచేత బ్రతుకుతారు, సిలువ వల్ల బ్రతుకుతారు, సిలువ కోసం బ్రతుకుతారు. పౌలు "జీవించువాడను నేను కాదు, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు". అంటే సిలువ వేయబడిన క్రీస్తే నా ద్వారా జీవిస్తున్నాడు. మహాశుక్రవారం అయిపోయిన తరువాత ఇక సిలువతో పని లేదనుకోకూడదు. చాలా మంది చేసేది మూడు గంటలకు ప్రభువును భూస్థాపితం చేసిన విధంగానే సిలువను కూడ భూస్థాపితం చేస్తారు. దయచేసి అర్థం చేసుకోండి! ప్రతీ క్రైస్తవుడి జీవితంలో సిలువ అంతర్భాగం. నేను సమాధిలోకి పోయేదాక నా సిలువను ఎత్తుకొని యేసుప్రభువును వెంబడించ వలసిందే!

**తరువాయి భాగం వచ్చే సంచికలో**

లూర్థుస్వామి,
బెల్లంపల్లి




# పునీత బొనిఫాసు
## (ఆర్చిబిషప్పు, జర్మనీ అపోస్తలుడు, వేదసాక్షి (క్రీ॥శ॥ 673 - 754)

యూరపుఖండ మధ్యప్రాంతంలోని జర్మనీ దేశ కొండజాతి ప్రజలలో క్రైస్తవం విస్తరించిందంటే ఆ కృషి ఫలితమంతా పునీత బొనిఫాసు గారికే దక్కుతుంది. అందుకే వారికి 'జర్మనీ దేశ అపోస్తలుడు' అని బిరుదు కూడ వచ్చింది. వారు ఇంగ్లాండు దేశంలోని దేవన్‌షైర్ నగరంలోని క్రెడిటన్ అనుపేటలో క్రీ॥శ॥ 673లో జన్మించారు. జ్ఞానస్నానం పేరు విన్‌ఫ్రిడ్.

వారు చిన్నప్పుడు కొందరు సన్యాసి గురువులు వారి ఇంటికి అప్పుడప్పుడు వచ్చిపోతూ ఉండేవారు. వారి సంభాషణలు వినడం ద్వారా వారివలె తాను కూడ పెద్దయ్యాక మంచి క్రైస్తవ గురువు కావాలనే దైవపిలుపు వారిహృదయంలో ఒక నిప్పుకణికలా ఉండిపోయింది. వారు ఏడవ ఏట ఎక్సెటర్ అనే గ్రామం దగ్గరలోని ఒక మఠపాఠశాలలో చేరి చదువుకున్నారు. తమ 14వ ఏట శిశుకేంద్రం నిర్వహిస్తున్న ఒక బెనెడిక్టియను మఠంలో ప్రవేశం పొందారు. అక్కడ మఠాధిపతియైన విన్‌బెర్ట్ గారికి శిష్యరికం చేసి పైచదువుల్లో నెగ్గి ఆ మఠ డైరెక్టరుగా కూడ నియమితులు కావడం విశేషం. విన్‌ఫ్రిడ్ గారు సాహిత్యం, సువార్తలను బోధించడంలో నిష్ణాతులని పేరు గడించారు. క్రీ॥శ॥ 715లో గురుపట్టం పొందారు. ఫాదర్ విన్‌ఫ్రిడ్ గారికి ఫ్రీస్‌లాండ్ (ఉత్తర నెదర్లాండు)లో అధిక సంఖ్యలో తమ బంధువులైన ఆంగ్లోశాగ్సనులున్నారు. వారిని ఎలాగైనా క్రైస్తవంలోకి తీసికొనిరావాలని తీవ్ర వాంఛ కలిగి ఉన్నారు. ఇప్పటికే కొంతమంది ఆంగ్లేయ గురువులు అక్కడ పని చేస్తున్నారు. తాను కూడ వెళ్లి 3సం॥లు పని చేశారు. ఒకసారి ఫాదర్ విన్‌ఫ్రిడ్ రోము సందర్శించినప్పుడు క్రీ॥శ॥ 718లో 2వ గ్రెగోరి జగద్గురువులు వారిని జర్మనీ వెళ్లి క్రీస్తు సందేశం విన్పించాలని కోరారు. అందుకు విధేయించి వారు జర్మనీ వెళ్లగా అక్కడి పాలకులు వారిని సాదరంగా ఆహ్వానం పలికారు. ఫాదర్ విన్‌ఫ్రిడ్ గారు సాహిత్య ప్రకాండుడు కావడాన అక్కడి ప్రజలకు అర్థమయ్యే భాషలో, యాసలో మాట్లాడటం మొదలుపెట్టారు.

జర్మనీ దేశంలో హెస్సియా పట్టణ ప్రాంతంలోని కొండజాతి ప్రజలు ఏవో దబ్బర దేవుళ్లను పూజిస్తుండేవారు. వారిలోని మూఢనమ్మకాల్ని, అజ్ఞానాన్ని తొలగిస్తే వారిని సరియైన గాటిలో పెట్టవచ్చని తలంచారు ఫాదర్ విన్‌ఫ్రిడ్. అందుకు

ముందుగా గిస్మర్ పట్టణం దాపులోని గూడెన్‌బర్గ్ పర్వతంపైగల ఒక సిందూరపు వృక్షం దగ్గరకు ఒక గొడ్డలి తీసికొనివెళ్లారు. అక్కడి కొండజాతి జనం ఆ చెట్టుకు ఎంతో ఇదిగా పూజలు చేస్తుండేవారు. సృష్టికర్త దైవంను విడిచి సృష్టి వస్తువులైన చెట్లు, జంతువులు, గ్రహాలను పూజించి ప్రయోజనం లేదని వారికి నచ్చజెప్పారు. అన్ని చెట్ల వలె ఆ సిందూరపు చెట్టుకూడ ఒకటని, దాన్ని నరికినా ఏమీ కాదని అర్థమయ్యేలా చెప్పారు. పిమ్మట తన చేతిలోని గొడ్డలితో ఆ చెట్టును నరకడం మొదలు పెట్టారు. ఎలాంటి కీడు జరగకుండ ఆ చెట్టు కూలిపోయింది. ఆ ప్రజల అతి విశ్వాసాలన్నీ భ్రమలని, కల్పితాలని అర్థం చేసుకొని వస్తుపూజ విసర్జించారు. ఆ క్రైస్తవ గురువును వెంబడించి క్రైస్తవ మతావలంబికులై జ్ఞానవంతులయ్యారు. ఇక ఫాదర్ గారు తమ సువార్తా పనిని కొనసాగింప తురంగియా పట్టణం చేరుకున్నారు. క్రీ॥శ॥ 722లో 2వ గ్రెగొరి జగద్గురువులు ఫాదర్ విన్‌ఫ్రిడ్ గారిని రప్పించుకొని జర్మనీకంతటికి పీఠాధిపతిగా వారిని అభిషేకించి, క్రొత్త పీఠాలు నెలకొల్పడం వాటికి బిషప్పులను ఏర్పరచడానికి పూర్తి హక్కును ప్రసాదించారు. ఆ సమయంలోనే ఫాదర్ విన్‌ఫ్రిడ్ గారు పేరుకు లాటిను అర్థంలో బిషప్ బొనిఫాసుగా మార్చుకున్నారు.

నూతనోత్సాహంతో విచ్చేసిన బిషప్ బొనిఫాసు గారు జర్మనీలోని గురువులు మఠవాసినులందరిని ప్రేమతో కూడ గట్టుకొని క్రైస్తవ మతవ్యాప్తికి విశేషంగా కృషిసల్పారు. మఠాలయాలు అనేకం నెలకొల్పారు. ముఖ్యంగా ఒహుద్రుఫ్, రిచెనౌ, ముర్బక్, ఫ్రిట్జలర్, ఫుల్డా అనే పట్టణాలలో క్రైస్తవ మఠాశ్రయాలు తెరిచారు. విశ్వాసాన్ని, నాగరికతను ప్రజలకు నేర్పించారు. క్రీ॥శ॥ 747లో మెయింజ్ నగరం అగ్రపీఠంగా నెలకొల్పబడి దానికి అగ్రపీఠాధిపతిగా బొనిఫాసు గారిని నియమిస్తూ పునీత జకరి పోపుగారు ప్రకటించారు. జర్మనీ, గౌల్ రాజ్యాల తరపున వారే అపోస్తోలిక ప్రతినిధిగా వెల్లడించారు. జర్మనీ, ఫ్రాన్సుల్లో బొనిఫాసు గారు పీఠాల్ని, మఠాల్ని సంస్కరించి చైతన్యవంతం చేశారు. ఫ్రాన్సు రాజ్యపాలకుల్ని క్రైస్తవంలోకి వచ్చేలా చేశారు. "జర్మనీ పౌలు"గా పేర్గాంచారు. క్రీ॥శ॥ 754లో జూన్ 5న పెంతెకోస్తు పండుగ రోజున ఫ్రీస్‌లాండు (ఉత్తరహాలెండు)లోని దుక్కుం పట్టణంలో ఒక డేరాలో కొందరు విశ్వాసులకు భద్రమైన అభ్యంగమునకు తయారు చేస్తుండగా అవిశ్వాసుల గుంపు దాడిచేసి డేరాకు నిప్పుపెట్టారు. 12 మంది గురువుల్ని, 40 మంది భక్తుల్ని చంపారు. బొనిఫాసు గారి మృతదేహం ఫుల్డాపట్టణంలో సమాధి చేయబడింది. తాను విశ్వసించిన శ్రీసభ విశ్వాసం కోసం వారు ప్రాణాలర్పించారు. వారు ఈ విధంగా వ్రాశారు. "ప్రపంచ సాగర ప్రయాణంలో శ్రీసభ అనే ఓడకు జీవిత ఆటుపోటులు తప్పవు. అందువల్ల ఓడను త్యజించడం కాదు కొనసాగించడం మనవిధి". 9వ పయస్ (భక్తినాథ) పోపుగారు క్రీ॥శ॥ 1874లో వారికి పునీత పట్టం అలంకరించారు. బోనిఫాస్ అనగా బాగుగా పనిచేయు వ్యక్తి అని అర్థం.

**ధ్యానాంశం**

మనం మొరగని శునకాల్లా, నిద్రించే కావలివారిలా, తోడేలు వస్తే మందను విడిచి పారిపోయే జీతగాడిలా ప్రవర్తించకూడదు. సమయా సమయాల్లో కూడ మెలుకువతో చురుకుదనంతో ప్రవర్తించాలి. (పునీత బొనిఫాస్)




గత సంచిక తరువాయి భాగం

**5.12 దృష్టిదానం 8:22-26**

"మీరు కన్నులున్నను చూడలేరు, చెవులున్నను వినలేరు" (యిర్మీయా 5,21) అని యిర్మియా ప్రవక్త ద్వారా యావే ప్రభువు తన ప్రజల మందమతిని, గుడ్డి తనాన్ని తెలియజేవాడు. అలాగే యేసు శిష్యుల మందమతిని, గుడ్డితనాన్ని తెలిపి వారి కన్నులు తెరవటానికి ప్రయత్నించారు (మార్కు 8,14-21). ఇంతకు ముందే దానిని గమనించాం. శిష్యుల మందమతిని, యేసు జ్ఞాన బోధను చదువరులు గ్రహించుటకు పరిసయ్యుల దుర్బోధను గూర్చిన హెచ్చరిక తర్వాత మార్కు దృష్టిదానమును ప్రస్తావించాడు.

బెత్సయిదాలోని ప్రజలు గుడ్డివానికి దృష్టిని ప్రసాదించమని ప్రార్థించగా, వానిని ఊరి వెలుపలికి తీసుకెళ్ళి రెండంచలుగా యేసు వానికి దృష్టిని ప్రసాదించాడు. మొదట ఉమ్ముతో కళ్ళుతాకినపుడు మనుషులు చెట్లులాగ కన్పించారు. రెండవసారి తాకినపుడు స్పష్టంగా చూడగలిగాడు. అలాగే మందమతులై గుడ్డివారుగా ఉన్న శిష్యులను ప్రజల నుండి దూరంగా తీసుకువెళ్ళి ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా వారికి బోధించాడు. అంచెలంచెలుగ తన బోధతో వారికి జ్ఞానదృష్టిని ప్రసాదించాడు. క్రమక్రమంగా తాను క్రీస్తునని గ్రహించేటట్లు చేశాడు.

### 6. శిష్యుల తర్ఫీదు, శిష్యలక్షణము 8:27-10:52

ఈ విభాగంలో యేసు ఏ విధముగ తన శిష్యులను, తన సిలువ మరణ పునరుత్థానములు స్వీకరించటానికి తర్ఫీదు నిచ్చాడో గమనిస్తాం! మెస్సయా క్రీస్తును బాధామయు సేవకునిగా అంగీకరించాలన్నాడు. ఆయన అడుగుజాడల్లో శిష్యులు కూడా పయనించాలన్నాడు.

### 6.1 యేసు ప్రశ్న - పేతురు సమాధానం 8:27-30

గలిలియ ప్రాంతంలో యేసు సువార్త పరిచర్య ముగిసింది. యేసు యెరూషలేము వైపు సాగిపోతున్నాడు. కైసరియా పిలిప్పి ప్రాంతంలో పరిచర్య గావిస్తున్నాడు. గలిలియా ప్రాంతంలో తన పరిచర్యలో, సహచర్యంలో శిష్యులు తన గురించి ఏమను కుంటున్నారో తెలుసుకోగోరాడు. పేతురు శిష్యులందరి తరపున యేసు 'కీస్తు' అని సమాధానమిచ్చాడు. ఈనాడు కూడ యేసు తన శిష్యులైన మనలను ప్రశ్నిస్తున్నాడు? యేసు మనకు ఎవరు? మన సమాధానం కూడ ఆయన 'క్రీస్తు' అని రావాలి. పౌలుతో పాటు మనం కూడా "నన్ను ప్రేమించి నా కొరకై ప్రాణత్యాగం చేసిన దేవుని పుత్రుడు" (గలతీ 2,20) అని మన విశ్వాసాన్ని వ్యక్తం చేయాలి.

### 6.2 జీవస్మరణములు 8:31-9:1

పేతురు యేసును 'క్రీస్తుగ' విశ్వాసాన్ని ప్రకటించిన తర్వాత యేసు మొట్టమొదటి సారిగా తన సిలువ మరణ పునరుత్థానముల గూర్చి ప్రస్తావించాడు, ప్రవచించాడు. ఎందువలననగా, ఇశ్రాయేలు ప్రజలు రాబోయే క్రీస్తు (మెస్సయా) తమను పరాయిపాలన నుండి విముక్తి చేసి, దావీదువలె మరలా ఇశ్రాయేలు రాజ్యమును సుస్థిరము చేయువానిగా ఎదురు చూస్తున్నారు. అయితే 'క్రీస్తు'గా యేసుకు దేవుని చిత్తం ఇంకొకటి. అది ఆయన శ్రమలు, సిలువ మరణ పునరుత్థానముల ద్వారా మానవాళిని పాపము నుండి విముక్తి చేయటమే. అందుకే పేతురు యేసును 'క్రీస్తుగ' అంగీకరించగనే, తన శిష్యులు కూడా ప్రజలలాగా తనను ఒక రాజకీయ 'క్రీస్తు' గా అపార్థం చేసుకో కుండుటకై యేసు తన శ్రమల మరణ పునరుత్థానములను గూర్చి మొదటిసారిగా ప్రవచించాడు, ప్రస్తావించాడు.

పేతురు, యేసు శ్రమల మరణ ప్రవచనములకు అభ్యంతరం తెలుపగా యేసు పేతురును 'సాతాను' అని సంబోధించాడు. బాధామయసేకునిగా యేసుని దేవుని చిత్తం నుండి తొలగించే ప్రయత్నం సాతానునిదే. ఆ సాతాను మానవుల ఆలోచనలను ప్రభావితం చేసి దేవుని చిత్తం నుండి, మార్గం నుండి వైదొలగునట్లు చేయును. అందుకే పేతురు యేసుని శ్రమల సిలువ మార్గం నుండి వైదొలగించే ప్రయత్నం చేయగా, యేసు పేతురును 'సాతాను' అని సంబోధించి మందలించాడు. అదే విధంగా ఈనాడు మనం దేవుని చిత్తం, ఆజ్ఞలను నెరవేర్చనపుడెల్లా 'సాతాను' శోధన ప్రకారమే నడచుకుంటున్నాం (యోహాను 8:39-47).

**తరువాయి భాగం వచ్చే సంచికలో**



# ఏకైక మహిళ న్యాయాధిపతి దెబోరా

క్రీస్తుపూర్వం, 12 శతాబ్దంలో, జీవించిన అసామాన్యమైన వనిత 'దేబోరా' న్యాయాధిపతుల గ్రంథం 4,5 అధ్యాయాలు దేబోరా గురించి వివరిస్తున్నాయి. 4వ అధ్యాయం గద్యరూపంలోను, 5వ అధ్యాయం పద్యరూపంలో ఉన్నాయి.

దెబోరా అనే పదానికి అర్థం తేనెటీగ. ఈ పేరు ఆమెకు సరిగ్గా సరిపోతుంది. తేనెటీగలు తేనెతట్టు ద్వారా మకరందాన్ని, తీపిని అందిస్తున్నాయి. అంతేగాక తేనెటీగలు తమ జీవితానికి ఆపద వస్తుందని తెలిసినప్పుడు శత్రువులను చంపడానికి సిద్ధపడతాయి. ఈ రెండు విషయాలు మనం దేబోరా జీవితంలో చూడవచ్చు.

దెబోరా యిస్రాయేలు ప్రజలకు న్యాయాధిపతిగా ఉండేది. యెహూషువ మరణం తరువాత చెల్లాచెదురైన యిస్రాయేలు ప్రజలను శత్రువులు తరుచుగా ముట్టడించేవారరు. శత్రువుల నుంచి యిస్రాయేలు ప్రజలను కాపాడడానికి దేవుడు నాయకులను లేవనెత్తాడు. వారినే న్యాయాధిపతులుగా పిలిచేవారు. క్రీ.పూ. 1200 నుండి 1030 వరకు ఉన్న కాలాన్ని న్యాయాధిపతుల కాలంగా పిలుస్తారు. న్యాయాధిపతులలో అనేక మంది యుద్ధవీరులే. సమస్యలను వినడం, తీర్పులు చెప్పడం వంటివి న్యాయాధిపతుల బాధ్యత కాదు. అయినప్పటికీ దెబోరా ఈ రెండు కార్యాలను నిర్వహించేది.

"ఆ రోజులో దెబోరా యిస్రాయేలీయులకు తీర్పు తీర్చుచుండెను. ఆమె ప్రవక్త్రీ. లప్పీడోతు భార్య. ఎఫ్రాయీము కొండలలో రామా, బేతేలు నగరములకు మధ్యనున్న "దెబోరా ఖర్జూరము చెట్టు" క్రింద కూర్చుండి యుండెడిది. యిస్రాయేలీయులు ఆమె చెంతకు వచ్చి, తమ తమ తగవులను పరిష్కరించుకునెడి వారు" (న్యాయాధిపతులు 4,4-5). ఎఫ్రాయీము అనే ప్రదేశంలో ఖర్జూరపు చెట్లు చాలా తక్కువగా ఉండేవి. అందుకనే దెబోరా పేరు మీదనే "దెబోరా ఖర్జూరం చెట్టు" అని ఆ చెట్టు ప్రసిద్ధిగాంచింది. ఎప్పుడు పచ్చగా ఉండే ఈ ఖర్జూరపు చెట్టు ఆకులు సుఖసంతోషాలను సూచిస్తున్నాయి. ఆ చెట్టు జీవాన్ని సూచిస్తుంది. అందుకనే, "దెబోరా! నీవు యిస్రాయేలీయుల పాలిటి తల్లివలె విజయము చేయు వరకు ఈ దేశమంత నిర్జీవమై యుండెను" (న్యాయా 5,7) అని యిస్రాయేలు ప్రజలు ఆమెను కొనియాడేవారు.

తీర్పులు చెప్పటం లేక న్యాయం చేయడం మాత్రమే కాక దెబోరా యిస్రాయేలీయులను శత్రువుల నుండి కాపాడింది. రాజైన యాబీను యిస్రాయేలీయులను 20 సంవత్సరాల పాటు చిత్రహింసలకు గురిచేసాడు. దెబోరా యాబీను యిస్రాయేలీయులను విడిపించెను. ఆమె బారాకును సైన్యాధిపతిగా నియమించినప్పటికీ బారాకు ఆమెతో "నీవు నా వెంట వచ్చెదవేని నేను వెళ్ళెదను. నీవు రావేని నేను వెళ్ళను" (న్యాయా 4,8) అని అన్నాడు.

అప్పుడు ఆమె యుద్ధానికి సిద్ధం అయింది. "అప్పుడు దెబోరా బారాకును హెచ్చరించి 'పోయి శత్రువుపై పడుము. నేను యావే సీస్రాను నీ వశము చేసెను. ప్రభువు నీ సైన్యమునకు ముందుగా తరలిపోవు' అని చెప్పెను (న్యాయా 4,14). ఇది విన్న బారాకు యుద్ధానికి బయలుదేరాడు. "బారాకు రాగానే యావే సీస్రాకు, అతని రథములకు, సైన్యములకు భయము పుట్టించి వారిని కలవరపరచెను. సీస్రా రథముదిగి పిక్క బలముకొలది పారిపోయెను" (న్యాయా 4,15) ఆ విధంగా దెబోరా మరియు బారాకు యుద్ధంలో విజయాన్ని సాధించారు.

యుద్ధం కొరకు తాబోరు కొండను ఎన్నుకోవడం దెబోరా యుద్ధకౌశల్యానికి నిదర్శనం. తాబోరు కొండపై రథములను ఉపయోగించడం అంత సులువైన పనికాదు. అంగేకాక, దేవుడు సీస్రా సైన్యమునకు భయము పుట్టించి వారిని కలవరపరచాడు. అందుకే, సీస్రా రథము దిగి ప్రాణాన్ని కాపాడుకోవడం కోసం పారిపోయాడు. ఈ యుద్ధంలో యిస్రాయేలు ఆరు గోత్రములు కలిసికట్టుగా పోరాడాయి. ఈ ఆరు గోత్రాలను కలపటంలో, కలిసి పనిచేయించడంలో దెబోరా నెగ్గింది.

దెబోరా ఒక ప్రవక్త్రి. ఆమె దేవుని చిత్తాన్ని విని యిస్త్రాయేలు ప్రజలు దేవుని మార్గంలో నడవడానికి సహాయపడింది. ఇదే ప్రవక్తలకు ఉన్న బాధ్యతలలో ఒకటి. దేవుని సందేశం భగ్నహృదయులకు ఓదార్పును కల్గిస్తుంది. దారి తప్పిపోయిన వారిని సరియైన మార్గం గుండా నడిపిస్తుంది. దేవుని మార్గం నుండి వైదొలగినందుకు వచ్చే శిక్షను ప్రవక్తలు ముందుగానే ప్రజలకు హెచ్చరిస్తారు. అంతేగాక, దేవుడు వారికోసం చేసే వాగ్దానాలను, భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తారు. ఈ బాధ్యతలన్నీ ఆమె ఒక ప్రవక్త్రిగా నిర్వహించేది.

దెబోరా ఒక తల్లిలాగా విడిపోయిన యిస్రాయేలీయుల గోత్రాలను కలిపింది. వారి మధ్య ఐక్యమత్యాన్ని తెచ్చింది. నిరాశలో కూరుకుపోయిన యిస్రాయేలు ప్రజలకు ఆమె మాటలు, ఆమె నాయకత్వం క్రొత్త ఊపిరిని పోసింది. ఆమె ధైర్యం, వివేకం, చాతుర్యం, న్యాయకౌశల్యం, ప్రార్థన జీవితం అందరికి ఆదర్శ ప్రాయం.

ఆమె యిస్రాయేలీయుల పాలిటి తల్లిగా (న్యాయా 5,7) ఖ్యాతిని గడించింది. యిస్రాయేలీయులకు ఆత్మీయ తల్లిగా నిలిచిన ఆమె జీవితం స్త్రీలందరి ఆత్మీయ మాతృత్వాన్ని తెలియపరుస్తుంది. స్త్రీలు కూడా న్యాయాధిపతులుగా రాణించడంలో, యుద్ధ కౌశల్యాన్ని ప్రదర్శించడంలో, దేవునికి ప్రజలకు మధ్యవర్తిగా, ప్రజలను సరియైన మార్గంలో నడిపించడంలో, విజయం సాధించగలరిన సహస్రాబ్దాల పూర్వమే దెబోరా జీవితం నిరూపించింది. ఆమె నేర్పిన ఈ జీవిత పాఠాలను నేర్చుకొని దేవుని బాటలో ముందుకు సాగుదాం...!

దేవుడు మనలందరిని దీవించును గాక! ఆమెన్.

# శుభవచనం బైబిల్ క్విజ్

**మత్తయి సువార్త 1-14 అధ్యాయాలు**

పేరు ...........................ఇంటి పేరు.......................విచారణ .............................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

ఫోన్ నెంబర్.................................

1) అబ్రాహాము ............................................................................. తండ్రి.

2) అప్పుడు ................................... తమ తండ్రి రాజ్యములో ......................... వలె ప్రకాశింతురు.

3) మా వద్ద ......................................, ..................................... తప్ప మరేమియు లేవు.

4) మానవులందరిలో ........................................... కంటె అధికుడగు వాడు ఎవ్వడు పుట్టలేదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

5) నీ ...................................................... పరిహరింపబడినవి అని యేసు పలికెను.

6) ఆ క్షణముననే ............................................................... సేవకుడు స్వస్థత పొందెను.

7) ఆయన మన ...............................................................తనపై వేసికొనెను.

8) నీ సంపదలున్న చోటనే నీ ......................................................................... .

9) మీ శత్రువులను ................................................ మిమ్ము హింసించు వారి కొరకు ప్రార్థింపుడు.

10) హృదయ శుద్ధిగలవారు ధన్యులు వారు ........................................................ దర్శింతురు.

11) నేను ఆయన ................................................... మోయుటకైనను యోగ్యుడను కాను.

12) కాని దేవుని నోటి నుండి వచ్చు ప్రతి ............................................... వలన జీవించును.

13) మరియమ్మకు ........................................................ అనబడు యేసు జన్మించెను.

14) మీరు లోకమునకు ........................................................................... యున్నారు.

15) ........................................................................... పోవు ద్వారము ఇరుకైనది.

16) మన ........................................................................ తానే భరించెను.

17) దావీదు కుమారా! మమ్ము ........................................................... అని మొర పెట్టుకొనిరి.

18) హృదయ పరిపూర్ణత నుండి కదా ................................................................ వెలువడునది.

19) నేను ........................................................................... కోరుచున్నాను బలినికాదు.

20) తన ....................................................... నన్ను అనుసరింపనివాడు, నాకు యోగ్యుడు కాదు.

21) కనుక సర్పముల వలె ................................. పావురముల వలె ........................... మెలగుడు.

22) నాకు ............................................................... కావలయును గాని బలి అవసరము లేదు.

23) ఇమ్మానువేలు అనగా ............................................................. ఉన్నాడు అని అర్థము.

24) దీనాత్ములు ధన్యులు ......................................................................... వారిది.


25) కావున నీ ................................................................. పరలోకమందు కూడబెట్టుకొనుము.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ జూన్ నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: మత్తయి సువార్త 15-28 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"నేను మంచి కాపరిని. నన్ను నా తండ్రి ఎరిగియున్నట్లు నేను నా తండ్రిని ఎరుగుదును. అట్లే నేను నా గొఱ్ఱెలను, నన్ను నా గొఱ్ఱెలును ఎరుగును. నేను గొఱ్ఱెల కొరకు నా ప్రాణమును ఇచ్చెదను" (యోహాను 10,14-15). ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:..................................వయస్సు.......తరగతి.......స్థలం....................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ జూన్ నెల 25 తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్నారులారా...!**

మనం ఎల్లప్పుడు దేవునికి "కృతజ్ఞతలు" Thank you Jesus అని చెప్పాలి అని దేవుడు ప్రతి ఒక్కరికి ఈ రోజు చెబుతున్నాడు. మనం ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే మనం ఆయన నుండియే ప్రతీది పొందుతున్నాము కాబట్టి. పిల్లలమైన మన దగ్గర నుండి దేవుడు ఆశించే ఉత్తమమైన ప్రార్థన Thank you Jesus.

ఒక ఊరిలో ఒక చిన్న అబ్బాయి ఉన్నాడు. ఆ అబ్బాయి అర్థరాత్రి గాడ నిద్రలో ఉన్నాడని గ్రహించి దేవుడు ఆయన దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ అబ్బాయి మంచం ప్రక్కన కూర్చొని ఆయనను రక్షిస్తున్నాడు. ఒక ఉదయాన ఆ అబ్బాయి నిద్ర లేచే సమయంలో దేవుడు ఆ అబ్బాయి దగ్గర నుండి ఒక్క చిన్న Thank you Jesus అనే ప్రార్థనను ఆ అబ్బాయి ప్రార్థిస్తాడని దేవుడు ఆశించాడు. కానీ ఆ అబ్బాయి నిద్రలేచి దేవునికి కృతజ్ఞతలు చెప్పకుండ స్నానం చేయడానికి వెళ్తాడు. అప్పుడు దేవుడు చాలా బాధపడలేదు. కానీ పాఠశాలకు వెళ్ళెముందయిన దేవునిని గుర్తు చేసుకొని Thank you చెప్తాడని దేవుడు ఆశిస్తాడు. కానీ ఆ అబ్బాయి దేవునికి కృతజ్ఞతలు తెలియజేయకుండ తొందరగా పాఠశాలకు వెళ్తాడు. కనీసం సాయంత్రం కుటుంబ ప్రార్థనలోనైన దేవుడు ప్రొద్దున నుండి సాయంత్రం వరకు ఇచ్చిన మేలులకు Thank you Jesus అనే మాటను దేవుడు ఆశిస్తూ సాయంత్రం ఆ అబ్బాయి దగ్గరికి వస్తాడు. కానీ అబ్బాయి ఫోన్ చూస్తూ అలాగే నిద్రలోకి జారుకుంటాడు. కనీసం తరువాత రోజుయైన ఆ అబ్బాయి లేచిన వెంటనే Thank you Jesus అని అంటాడేమో అని దేవుడు మళ్ళీ అర్థరాత్రి వచ్చి ఆ అబ్బాయిని రక్షిస్తూ కాపాడుతూ ఉంటాడు.

ప్రియమైన పిల్లలారా, మనమంటే దేవునికి చాలా ఇష్టం. మనకు మంచి ఆరోగ్యాన్ని దేవుడే ఇస్తున్నాడు. ఉదయం నుండి రాత్రి వరకూ దేవుడే కాపాడుతున్నాడు. కాబట్టి మనమందరం దేవునికి Thank you Jesus అని చెప్పాలి. ఎప్పుడు వీలయితే అప్పుడు Thank you Jesus అని ప్రార్థనను ప్రార్థిస్తూ దేవుడికి కృతజ్ఞతలు తెలియజేద్దాం. ఆ అబ్బాయిలాగా కాకుండ కృతజ్ఞత మస్తత్వం కలిగి, మనకు ఎవ్వరైన మంచి చేసినప్పుడు వారికి Thank you అని చెప్పడం మనందరికి ఉత్తమం

**Thank you Jesus**



# క్షమాపణ

**"పరులను క్షమింపుడు. మీరును క్షమించబడుదురు"** (లూకా 6,38).

ప్రస్తుత యువతకు కష్టతరమైన విషయం ఏమిటంటే క్షమించే మనస్తత్వం కలిగి ఉండటం. మనకు అన్యాయం చేసిన వారిని క్షమించడం అనేది ఒక కష్టతరమైన పని అయినప్పటికిని ఇది దేవుడు మనకు ఇచ్చిన ఆజ్ఞగ భావించాలి. ఇది క్రైస్తవుడు యేసు ప్రభు నుండి ముఖ్యంగ యువత యేసు క్రీస్తు నుండి నేర్చుకోవలసిన ముఖ్య అలవాటు మనలను, మన పొరుగువారిని అలాగే మన శత్రువులను క్షమించడం. మత్తయి 6,14-15లో ఇలా చూస్తాము. "మీరు ఇతరుల తప్పులను క్షమించినట్లయితే, మీ పరలోకపు తండ్రి కూడ మీరు చేసిన తప్పులను క్షమిస్తాడు. కాని మీరు ఇతరుల తప్పులను క్షమించకపోతే మీ తండ్రి మీ అపరాధములను క్షమింపడు" క్రైస్తవ మతంలో క్షమాపణ అనేది ఒక సంపూర్ణమైన ఆజ్ఞ అయినప్పటికిని ఇది పాటించడం కష్టతరంగా కనిపిస్తూ ఉంటుంది. నేడు మనము వార్త పత్రికలలో గమనించినట్లయితే, చాలా విషయాలకు మితిమీరిన కోపం ఒక కారణంగా కనిపిస్తుంది. ఆ కోపంలో తాను ఏమి చేస్తున్నాడో తనకు తెలియదు. కానీ మనం సువార్త బాగంలో గమనించినట్లయితే యేసు ప్రభు చాలాసార్లు క్షమించు విషయంపై, అందరూ ఒకరినొకరు క్షమించుకొని ఉండాలని బోధిస్తున్నారు. "ప్రభూ, నా సోదరుడు నాకు ద్రోహము చేయుచుండ నేనెన్ని పర్యాయములు అతనిని క్షమించవలెను? ఏడు డెబ్బది పర్యాయములు" అని సమాధాన మిచ్చెను (మత్తయి 18,21-22).

చాలాసార్లు మనం దేవుని క్షమ మరియు కరుణపై బ్రతుకుతున్నాం కానీ మనం ఇతరులను క్షమించే విషయంలో చాలా వెనకబడి యున్నాం. ప్రతిరోజు ప్రార్థించే పరలోక జపంలో "మా వద్ద అప్పుబడిన వారిని మేము క్షమించునట్లు, మా అప్పులను మీరు క్షమించండి" (మత్తయి 6,12)వ వచనంలో ప్రార్థిస్తాం. దాని అర్థం మొదటగ మనకు విరుద్ధంగా ఎవరైతే పాపం చేస్తారో మనం వారిని మనస్ఫూర్తిగా క్షమించాలి. ఒక క్రైస్తవ యువతకు ముఖ్యంగ ఉండవలసిన ఒక గుణం క్షమాగుణం.

యేసు క్రీస్తు తాను చనిపోతూ కూడ తనను హింసించిన వారిని క్షమించి ప్రేమించారు. నేడు ప్రతి ఒక్క యువతను ఉద్దేశించి ప్రభువు ముఖ్యముగ మూడు సందేశాలనిస్తున్నారు.

మొదటిగా, మనము దేవుని దృష్టిలో పాపము చేసిన వారమే. పాపమునకు వేతనము మరణము. కానీ మన పాపములను యేసు తనపైన వేసుకొని వాటిని క్షమించి తాను బలిగా మరణించారు. యువతయైన మనం మన చివరి జీవిత క్షణం వరకు మన సోదరులను క్షమిస్తూ ఉండాలి. వారి కోసం ప్రార్థిస్తూ ఉండాలి.

రెండవదిగా, మనము ఒకరిని క్షమించిన యెడల వాళ్ళను మన మిత్రులుగ చేసుకుంటున్నామే గానీ శత్రువులుగ చేసుకోవడం లేదు. ప్రపంచంలో ప్రతి ఒక్కరు సోదర భావంతో జీవించాలంటే ఒకరినొకరు క్షమిస్తూ ఉండాలి. క్రైస్తవ మతం యొక్క ముఖ్య సందేశము క్షమాగుణం యొక్క సందేశం. ఆ దేవుని దృష్టిలో అన్నింటికంటే చాలా గొప్పది. మనము మనకు ద్రోహము చేసిన వారిని క్షమించడం.

మూడవదిగా మనలను మనము క్షమించుకోవడం. చాలాసార్లు మనము ఎన్నో తప్పులు తెలిసో తెలియక చేస్తూ ఉంటాం. చాలా మంది వాటిని గురించి మన మీద కోప పడతూ ఉంటారు. కానీ మన తప్పులను మనం గుర్తించి వాటిని అందరికంటె ముందుగా మనం క్షమించాలి. చాలా మంది వారిని వారు క్షమించకుండ ఆత్మహత్యలకు పాల్పడుతు దేవుడు ఇచ్చిన ఈ జీవితాన్ని నాశనం చేసుకుంటూ ఉన్నారు. కావున ముఖ్యముగ మనలను మనము క్షమిస్తూ ముందుకు నడవాలి.

కావున ప్రియమైన యవ్వనస్తులారా, మన హృదయములను క్షమాగుణంతో నింపుకొని ఇతరులను ద్వేషించకుండ, వారిని ప్రేమిస్తూ ఒక మంచి క్రైస్తవ యువకుడిగా/ యువతిగ జీవిద్దాం. దేవుడు మనలను దీవించును గాక.

**" మనుష్య కుమారుడు సేవించుటకే గాని, సేవింపబడుటకు రాలేదు."**

**(మార్కు 10, 45)**

# బైబిల్ దృశ్యమాలిక


దేవుని ఆజ్ఞలు వ్రాసిన పలకలు
తీసుకొని మోసెస్ తిరిగి వస్తున్నాడు
యెహోవా, అన్ని జాతుల కంటే
అల్పులను నీకు సొంత జనులుగా
ఎన్నుకున్నావు. వారిని ఆశీర్వదించావు.
పాళెంలో
యుద్ధ ధ్వనులు
వినబడుతున్నాయి.
కాదు. అవి యుద్ధ
ధ్వనులు కావు,
అవి ఉత్సవ వేడుకల
ధ్వనులు.
పాళెంలో బంగారు దూడకు హోమములు, దహనబలులు
జనులు సమర్పిస్తున్నారు
ఇంత వరకు
ఏడు రోజులైనవి.
ఈ తిరునాళ్లను
మనం 14 రోజులు
జరుపుకోవాలి.
ఎంత అందమైన
దేవుడు
అమ్మో "మోసెస్"
వస్తున్నాడురా!
ఇజ్రయేల్


పది ఆజ్ఞల పలకలను “మోసెస్” విసరికొట్టాడు. విగ్రహారాధనకు పాల్పడ్డ వారిని యెహోవా శిక్షించాడు.
???
మరునాటి ప్రొద్దున
మీరు మహా పాపము కట్టుకున్నారు. యెహోవాను మీరు తిరస్కరించారు. మీ కొరకు క్షమాపణ వేడటానికి వెళ్తున్నా .....
!!!
పర్వతం పై “మోసెస్”
ఓ ప్రభూ. నా దేవా ఈ ప్రజలు మహాపాపం చేశారు, దయతో వారిని క్షమించండి. లేనిచో నన్ను జీవగ్రంథంలో నుండి తుడిచి వెయ్యండి

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**2 మక్కబీయులు గ్రంథము 1-15 అధ్యాయాలు**

1). కరుణామయుడవు (1,24)

2). గౌరవ ప్రదముగా (6,19-20)

3). ప్రార్ధనలు (1,6)

4). ఆ మందిరమునకు (3,39)

5). కరుణించునని (7,6)

6). జీవమును, ఊపిరిని (7,23)

7). దయచేసిన, ఆజ్ఞలను (8,36)

8). సంప్రదాయములను (4,15)

9). హృదయముల (2,3)

10). ఆజ్ఞలను (2,2)

11). దేవాలయమును (5,19)

12). శుద్ధికరణోత్సవము (10,6)

13). గృహనిర్మాణమున (2,29)

14). ప్రభువు (9,17)

15). అద్భుతములు (15,21)

16). ధైర్యమును (11,9)

17). మహోపద్రవముల (2,18)

18). పవిత్రాజ్ఞలకు (6,23)

19). యెరూషలేము (12,21)

20). క్షమింపవలయునని (12,42)

21). డెబ్బదియైదు అడుగులయెత్తు (13,5)

22). ప్రజల (2,17)

23). సహాయము (8,23)

24). కృతజ్ఞత స్తుతులతోను (10,38)

25). దేవునికి ప్రార్థన (15,26)

**వచ్చే నెల పాఠ్యాంశం: మత్తయి సువార్త 15-28 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com